క్లుప్తంగా

గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి ఇంటర్వ్యూలు

కోడుమూరు రూరల్: గూడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీగా ఇంగ్లిష్ సబ్జెక్టు బోధించేందుకు అర్హులైన అభ్యర్థులు ఈనెల 5న జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ రమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీలో 50 శాతం మార్కులతో పాసైన ఆసక్తి గల అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరవ్వాలని ప్రిన్సిపాల్ కోరారు.

నేడు హెచ్‌ఎంలు, పీఎంసీ చైర్మన్లకు శిక్షణ

గడివేముల: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎం, స్కూల్ కమిటీ చైర్మన్‌లకు శుక్రవారం స్థానిక జెడ్పీ పాఠశాలలో శిక్షణ కార్యక్రమం ఉంటుందని ప్రతిఒక్కరూ హాజరు కావాలని ఎంఈఓ మేరీ సునీత గురువారం తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పాఠశాలల అభివృద్ధి తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారన్నారు.

ఉపాధి లక్ష్యాలు సాధించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

ఓర్వకల్లు: జాతీయ ఉపాధి హామీ పథకంలో నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. గురువారం స్థానిక ఉపాధి కార్యాలయంలో ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. పనులను పూర్తి చేసేందుకు అందరూ సమన్వయంతో పనిచేసి పురోగతిని సాధించాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులకు గిట్టుబాటు వేతనం వారం వారం కూలీల ఖాతాలలో జమ చేయడం జరుగుతుందని ప్రచారం చేయాలన్నారు.ఏపీఓ కుమార్‌సాయినాథ్, సాంకేతిక, క్షేత్రస్థాయి సహాయకులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కల్లూరు: స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో శుక్రవారం ఎంపీపీ శారద అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల అధికారులు శాఖల వారీగా ప్రగతి నివేదికలతో హాజరుకావాలన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

6న పాణ్యంలో మండల మీట్

పాణ్యం: ఈనెల 6వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, గ్రామాల అధికారులు తప్పక హాజరు కావాలన్నారు. ఉదయం 11 గంటలకు మండల మీట్ ప్రారంభమవుతుందన్నారు. ఎంపీపీ అధ్యక్షతన జరగనున్న సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు.

వికసిత్ భారత్ యంగ్‌లీడర్స్ చాలెంజ్‌కు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాల నుంచి ఇద్దరు విద్యార్థులు వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ చాలెంజ్ నేషనల్ చాంపియన్‌షిప్ ఫైనల్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. కళాశాల డేటా సైన్స్ విభాగం నుంచి అమీర్ ఉసేన్, హిమబిందు ఈనెల 11, 12 తేదీల్లో న్యూఢిల్లీలోని నేషనల్ యూత్ ఫెస్టివల్ పాల్గొంటారన్నారు. జాతీయ వేదికపై ప్రధానమంత్రి నరేంద్రమోడీ సమక్షంలో ఫైనల్‌లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను చైర్మన్ శాంతిరాముడు, డైరెక్టర్ శివరామ్, సిబ్బంది లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

7న సెపక్‌తక్రా ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఆలూరు పట్టణంలోని కేవీకే ఇండోర్ స్టేడియంలో ఈనెల 7వ తేదీ ఉదయం 10 గంటలకు సెపక్‌తక్రా క్రీడాంశంలో జిల్లా స్థాయి జూనియర్ బాలబాలికలకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు సెపక్‌తక్రా జిల్లా సంఘం కార్యదర్శి జి.శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు 2005 జనవరి 1వ తర్వాత జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. ప్రతిభ కనబరచిన క్రీడాకారులు ఈనెల 17, 18 తేదీల్లో ప్రకాశం జిల్లా పొదిలిలో నిర్వహించనున్న 28వ రాష్ట్రస్థాయి జూనియర్ బాలబాలికల సెపక్‌తక్రా పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు 94402-57242 సెల్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఖాళీ కుర్చీలే తప్ప కానరాని అధికారులు



సి.బెళగల్ తహసీల్దార్ కార్యాలయంలో దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీలు



ఖాళీగా మండల సర్వేయర్, రీసర్వే డీటీ చాంబర్



రెవెన్యూ అధికారులు లేకపోవడంతో ఖాళీగా ఉన్న గది

- ఇబ్బందుల్లో ప్రజలు, విద్యార్థులు
- అవస్థలు పడుతున్న పోలీస్ అభ్యర్థులు

సిబెళగల్: మండల రెవెన్యూ అధికారులు గురువారం పత్తాలేకుండా పోవడంతో వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్, ఏఎస్‌ఓ తదితర మండల స్థాయి అధికారులతో పాటు కార్యాలయంలో కనీసం ఒక్కరు కూడా సిబ్బంది ప్రజలకు అందుబాటులో లేరు. అధికారులెవ్వరూ లేకపోవటంతో వారి చాంబర్‌లలో కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. అధికారుల సంతకాలు, భూ పరిపాలన పనులు మండలంలో పూర్తిగా స్తంభించాయి. తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి వ్యక్తిగత కారణాలతో సెలవులో ఉండగా ఇతర రెవెన్యూ అధికారులు, కార్యాలయ సిబ్బంది పత్తాలేకుండా పొయ్యారు. అయితే జిల్లా స్థాయి అధికారులు మండల స్థాయి రెవెన్యూ అధికారికి సెలవు మంజూరు చేసే సమయంలో కనీసం ఇన్‌చార్జ్ అధికారులను నియమించకపోవటం, ఉన్న అధికారులు తమ విధులకు సక్రమంగా రాకపోవడంపై మండల ప్రజలు మండిపడుతున్నారు.

ఆగిన డిజిటల్ సంతకాలు.. పోలీసు అభ్యర్థుల అవస్థలు

తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి వ్యక్తిగత సెలవుపై వెళ్లడంతో కుల, ఆదాయ,ఓబీసీ, ఇతర ధ్రువపత్రాల జారీ, ఆన్‌లైన్ సేవలు పూర్తిగా స్తంభించిపోయాయి. దీంతో ఇటు రైతులు, అటు ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డిజిటల్ కీ సైతం ఎవరికి అందజేశారో తెలియదని కార్యాలయ అధికారులు అంటున్నారు. మండలానికి చెందిన పలు గ్రామాల యువకులు పోలీస్ ఉద్యోగాలకై జరుగుతున్న ఎంపిక పోటీలకు అవసరమైన ధ్రువపత్రాలు పొందడం కోసం అధికారుల సంతకాల కోసం తీవ్ర అవస్థలు పడుతున్నారు. కార్యాలయానికి వచ్చే అభ్యర్థులకు కనీసం క్రిమిలేయర్, ఓబీసీ, ఫ్యామిలీ మెంబర్ ధ్రువపత్రాలకు సంతకాలు ఎవరు చేస్తారు, ఎక్కడ చేస్తారు, ఎప్పుడు చేస్తారన్న ప్రశ్నలకు సమాధానాలు చెప్పేవారు కూడా లేకపోవటంతో తీవ్ర ఆవేదనతో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. పైగా అభ్యర్థులకు ధృవపత్రాల పరిశీలిన, సమర్పణ గడువు సమీపిస్తుండటంతో ఆందోళనతో మండల కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి మండలానికి రెవెన్యూ అధికారిని నియమించి, ప్రజలకు సత్వర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సమాజంలో స్త్రీ, పురుషులు సమానమే



మాట్లాడుతున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి నాగ ప్రసాద్

కర్నూలు (రూరల్): సమాజంలో స్త్రీ, పురుషుడు సమానమేనని తేడాలు తగవని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి నాగ ప్రసాదు అన్నారు. మండల పరిధిలోని పసుపుల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం బేటీ పడావో- బేటీ బచావో, కిషోర బాలికల పోషకాహార ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్త్రీ, పురుషుల మధ్య వివక్ష ఉండరాదన్నారు. స్త్రీలు పురుషులతో సమానంగా రాణిస్తున్నారని కొనియాడారు. డెమో శ్రీనువాసులు మాట్లాడూతూ.. కిషోర బాలికలు ఐరన్, క్యాల్షియం అధికంగా ఉండే పాలు, ఆకుకూరలు, కూరగాయలు, గుడ్లు తీసుకోవాలని సూచించారు. అలాగే వారానికోసారి ఐరన్ మాత్ర వేసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న సంచార వాహన సేవల క్లినిక్‌ను తనిఖీ చేసి రికార్డులు, రిపోర్టులను పరిశీలించారు. గార్గేయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ అబ్దుల్ అనిద్, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి



బూజునూరు రెవెన్యూ సదస్సులో సర్టిఫికెట్లను అందజేస్తున్న తహసీల్దార్ తదితరులు

గడివేముల: భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వెంకటరమణ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని బూజునూరు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో భూ సమస్యలను పరిష్కరించేందుకు మంచి అవకాశమన్నారు. రీసర్వే జాయింట్ ఎల్‌పీఎంలు ఉంటే సదస్సులో ఎటువంటి రుసుము చెల్లించకుండా పరిష్కరించుకోవచ్చన్నారు.అనంతరం ఉచితంగా క్యాస్ట్ సర్టిఫికెట్లను అందజేశారు. సర్పంచ్ యేలంపల్లె రామచంద్రారెడ్డి, ఆర్ఐ వెంకటసుబ్బయ్య, వీఆర్వో ఇందిరమ్మ, నాయకులు రఘుమాధవరెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు

ఓర్వకల్లు: గత నెల 6వ తేదీన ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ సదస్సులు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. చివరి రోజు బైరాపురం గ్రామంలో సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించడమే సదస్సుల ముఖ్య ఉద్దేశమన్నారు. భూ సమస్యలపై వినతులు సమర్పిస్తే 45 రోజుల్లో పరిష్కంచేందుకు చర్యలు చేపడతామన్నారు. గ్రామంలో సర్వే నంబర్ 142/ఏ లో సుమారు 250 ఎకరాలు సాగుచేసుకుంటున్నామని, వాటికి పట్టాలు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరారు. సదరు భూమి అటవీశాఖ పరిధిలో ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారని, కలెక్టర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు. సదస్సులో మొత్తం 34 వినతులు వచ్చినట్లు చెప్పారు. గ్రామ సర్పంచ్ గంగాధరరెడ్డి, మండల సర్వేయర్ శంకర్ మాణిక్యం, రీసర్వే డీటీ షర్మిలారెడ్డి, ఏఎస్‌ఓ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలి

కోడుమూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎన్నికైన విద్యా కమిటీ సభ్యులు కలిసికట్టుగా పనిచేసి పాఠశాలల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీఓ రాముడు సూచించారు. గురువారం కోడుమూరులోని బాలుర హైస్కూల్లో మండలంలోని ప్రధానోపాధ్యాయులు, విద్యాకమిటీ సభ్యులకు ఎంఈఓలు వసంతలక్ష్మి, తైమూర్‌బాషా ఆధ్వర్యంలో పాఠశాలల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీఓ రాముడు మాట్లాడుతూ.. ప్రతి పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చూడలన్నారు. ప్రతి రోజు ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు పెట్టే మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించేలా చూడాల్సిన బాధ్యత హెచ్‌ఎంలు, విద్యాకమిటీ సభ్యులదేనన్నారు. రీసోర్స్ పర్సన్‌లు రసూల్, మాదన్న, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

అందరి సమన్వయంతో అభివృద్ధి

సి.బెళగల్: స్థానికుల సహకారం, విద్యార్థుల తల్లిదండ్రుల సమన్వయంతోనే ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంఈఓలు జ్యోతి, ఆదాంబాషా అన్నారు. గురువారం స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో మండలస్థాయి ఎస్‌ఎంసీ చైర్మన్ల శిక్షణ కార్యక్రమంలో భాగంగా.. అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు, ఎస్‌ఎంసీ చైర్మన్లతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ.. హెచ్‌ఎంలు, టీచర్లు, ఎస్‌ఎంసీ సభ్యులు పాఠశాలల అభివృద్ధిపై ప్రణాళికలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. విద్యాభివృద్ధికి అవసరమైన వసతులు, సౌకర్యాలను కల్పించేందుకు సత్వరం చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని సూచించారు. సీఆర్పీలు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ రాముడు

అనర్హుడి హాజరు

విద్యాశాఖ అధికారులు నిర్వహించిన మండలస్థాయి ఎస్‌ఎంసీ చైర్మన్ల శిక్షణకు అనర్హుడైన వ్యక్తి పాల్గొని, హాజరు అక్విటెన్స్‌లో ప్రస్తుత చైర్మన్‌గా ఎన్నికైన మహేశ్వరమ్మ పేరు వద్ద సంతకం చేశాడు. మండలంలోని బురాన్‌దొడ్డి జెడ్పీ హైస్కూల్ ఎస్‌ఎంసీ చైర్మన్ ఎన్నికైన బోయ వెంకటేష్‌పై గ్రామంలో పలు వివాదాలు ఉన్నాయి. దీనిపై గ్రామస్తులు, విద్యార్థి సంఘాల సభ్యుల ఫిర్యాదులతో ఆయన్ను అనర్హుడిగా తేల్చి చైర్మన్ బాధ్యతల నుంచి తొలగించారు. మరో సభ్యురాలు మహేశ్వరమ్మను ఎస్‌ఎంసీ చైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నారు. అయితే చైర్మన్ బాధ్యతల నుంచి తొలగింపునకు గురైన వ్యక్తి, అధికారిక శిక్షణ కార్యక్రమానికి హాజరు కావడంతో పాటు, ప్రస్తుత చైర్మన్ పేరున్న చోట ఫోర్జరీ సంతకం చేయడం చర్చనీయాంశంగా మారింది. విషయంపై మండల విద్యాశాఖ అధికారులను వివరణ కోరగా.. బురాన్‌దొడ్డి జెడ్పీ హైస్కూల్ ఎస్‌ఎంసీ చైర్మన్ స్థానంలో అనర్హతకు గురైన వ్యక్తి హాజరు కావడం, చైర్మన్ చేయాల్సిన చోట సంతకం చేయడం నిజమేనని చెప్పారు. హాజరు అక్విటెన్స్‌లో చేసిన మహేశ్వరమ్మ అనే ఫోర్జరీ సంతకాన్ని వైట్నర్‌తో చెరిపి వేశారు.



సమావేశానికి హాజరైన అనర్హుడు బోయ వెంకటేష్

మధ్యంతర భృతి ప్రకటించాలి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు

గడివేముల: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగులకు సంక్రాంతి కానుకగా 30% మధ్యంతర భృతి ప్రకటించాలని, అలాగే పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలను తక్షణమే చెల్లించాలని ఏపీటీఎఫ్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శులు మానపాటి రవి, ఆవుల మునిస్వామి డిమాండ్ చేశారు. గురువారం గడివేములలో జరిగిన ఏపీటీఎఫ్ సమావేశంలో వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి అధ్యక్షతన గురువారం జరిగిన రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో మధ్యంతర భృతి, కరువు భత్యం గురించి చర్చిస్తారని ఎదురుచూసిన ఉపాధ్యాయ, ఉద్యోగులకు తీవ్ర నిరాశ ఎదురైందన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు అవుతోందని, ఇంతవరకు 12వ వేతన సవరణ సంఘానికి కమిషనర్‌ను నియమించలేదన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డీఏల గురించి, ఆర్థిక బకాయిల గురించి ఆలోచించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉపాధ్యాయ, ఉద్యోగులకు సంక్రాంత్రి కానుకగా వేతన సవరణ సంఘానికి (పీఆర్సీ) కమిషనర్‌ను నియమించి, కమిషన్ నివేదిక సమర్పించేలోగా 30% మధ్యతర భృతి ప్రకటించాలన్నారు. అలాగే పీఎఫ్ లోన్లు, ఏపీజీఎల్ఐ లోన్లు, సరెండర్ లీవ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సిలర్లు ఎస్.మహబూబ్ బాషా, నాగన్న, జిల్లా మహిళా కార్యదర్శి కవిత, గడివేముల మండల శాఖ అధ్యక్షులు ప్రతాపరెడ్డి, ప్రధాన కార్యదర్శి బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించండి



యూటీఎఫ్ నాయకులతో కలిసి క్యాలెండర్, డైరీలను అవిష్కరిస్తున్న ఎంఈఓలు


సి.బెళగల్: మండల పరిధిలోని పలు గ్రామాల పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు కృషిచేయాలని మండలంలోని ఆయా ఉపాధ్యాయ సంఘాల నేతలు,పాఠశాలల హెచ్‌ఎంలు, టీచర్లు ఎంఈఓలు జ్యోతి, ఆదామ్‌బాషాను కోరారు. వారు గురువారం స్థానిక ఎంఈఓ కార్యాలయానికి చేరుకుని ఎంఈఓలకు నూతన సంవత్సర సుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని పాఠశాలలో నెలకొన్న వివిధ సమస్యలపై మాట్లాడారు. కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత, తరగతి గదులు, వంట గదులు, ప్రహరీ, మరుగుదొడ్లు, తాగునీరు తదితర సమస్యలు ఉన్నాయని వివరించారు. సమస్యలను జిల్లా విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. అనంతరం పీఆర్‌టీయూ, యూటీఎఫ్, ఎస్టీయూ, డీటీఎఫ్ నాయకులతో కలిసి ఎంఈఓలు నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీలను ఆవిష్కరించారు. పీఆర్‌టీయూ నాయకులు రాము, సురేష్, మల్లయ్య, పాపారాయుడు,విద్యాసాగర్ ఉన్నారు.

కందిపప్పు, జొన్నలు అందరికీ ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఎండీయూ వాహనాల ద్వారా జొన్నలు, చక్కెర, కందిపప్పు కొందరికే ఇస్తున్నారని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఇందిరాగాంధీ నగర్‌లో ఎండీయూ వాహనంలో సరఫరా చేసిన సరుకుల్లో బియ్యం తప్పా ఇతర సరుకులు లేవన్నారు. అడిగితే స్టాక్ లేదని చెబుతూ తప్పించుకుంటున్నారని, ప్రతి రేషన్‌కార్డుదారుడికి అర కేజీ చక్కెర, కేజీ జొన్నలు, కేజీ బ్యాళ్లు ఇవ్వలేరా అని ప్రశ్నించారు. అందరికీ అన్ని రకాల సరుకులను సరఫరా చేయకపోతే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని స్పష్టం చేశారు.

పెద్దాసుపత్రి రూపురేఖలు మారుస్తా

- శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్‌పై ప్రత్యేక దృష్టి
- వైద్యులు, సిబ్బంది హాజరుపై నిఘా
- హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ పి.సింధు సుబ్రహ్మణ్యం



కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల రూపురేఖలు మార్చేందుకు తన వద్ద ప్రత్యేక ప్రణాళికలు ఉన్నాయని హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ పి. సింధు సుబ్రహ్మణ్యం చెప్పారు. ఆమె గురువారం 'సాక్షి'తో మాట్లాడుతూ దివంగత ఐఏఎస్ పి.సుబ్రహ్మణ్యం కుమార్తెనైన తన స్వస్థలం నెల్లూరు అని చెప్పారు. తండ్రి సుబ్రహ్మణ్యం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డితో ప్రయాణిస్తూ హెలికాప్టర్ ప్రమాదంలో 2009 సెప్టెంబర్ 2న మరణించారన్నారు. గత ప్రభుత్వం 2019లో తనకు డిప్యూటీ కలెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చిందని చెప్పారు. కోనసీమ జిల్లా అమలాపురం ఆర్‌డీఓగా కొంత కాలం పనిచేశానని, పూర్తిగా రెవెన్యూ శాఖలో ఉన్న తనకు ఇప్పుడు హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్‌గా నియమించడం కొత్తగా ఉందన్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఉన్న సమస్యలు, సవాళ్లు అన్నీ తెలుసుకుంటున్నానని చెప్పారు. ముఖ్యంగా పారిశుద్ధ్య, సెక్యూరిటీ, పెస్టకంట్రోల్‌ను సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటానన్నారు. ఈ మేరకు సదరు ఏజెన్సీల నిర్వాహకులు, వర్కర్స్‌తో సమావేశమవుతున్నట్లు తెలిపారు. ఆసుపత్రి బ్లూ ప్రింట్ తీసుకుని ఎక్కడ ఎలాంటి సమస్యలు ఉన్నాయి, వాటిని ఎప్పుడు, ఎలా పరిష్కరించాలన్న ప్రణాళిక రూపొందించాల్సి ఉందన్నారు. ఇప్పటికే కొన్ని సమస్యలు గుర్తించామని, అంచెలంచెలుగా వాటిని పరిష్కరిస్తామన్నారు. ముఖ్యంగా వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది, ఇతర ఉద్యోగుల హాజరుపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ విధి నిర్వహణలో ఆసుపత్రిలోనే ఉండే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

అనారోగ్యంతో ఎస్‌ఓ మృతి



కేజీబీవీ ప్రిన్సిపాల్ ఏ.లలిత (ఫైల్)

పాణ్యం: స్థానిక కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఏ.లలిత (39) అనారోగ్యంతో మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె హైదరాబాద్‌లో పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నా నయం కాలేదు. ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో నంద్యాలోని ఉదయానంద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పాఠశాల సిబ్బంది తెలిపారు. విషయం తెలుసుకున్న విద్యాశాఖ అధికారులు, పాఠశాల సిబ్బంది ఆమె భౌతిక కాయానికి నివాళులర్పించారు. ఆమె స్వగ్రామం గడివేముల మండలం చిందుకూరు గ్రామం. 2011లో సీఆర్టీగా సంజామల మండలంలోని కేజీబీవీలో ఇంగ్లిష్ ఉపాధ్యాయురాలుగా పని చేశారు. 2013లో పాణ్యం కేజీబీవీ ఎస్‌ఓ (స్పెషల్ ఆఫీసర్‌గా)గా బాధ్యతలు తీసుకున్నారు. ఆమె మృతితో కుటుంబ సభ్యులు, పాఠశాల సిబ్బంది కన్నీటిపర్యంతమయ్యారు.

రాష్ట్రంలో యువతులకు రక్షణ కరువు

కర్నూలు సిటీ: ఎమ్మిగనూరు సమీపంలోని బనవాసి గురుకుల జూనియర్ కాలేజీలో విద్యార్థి నిని వేధింపులకు గురి చేసిన లైబ్రేరియన్‌ను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ మహిళా విభాగం కన్వీనర్ కె.సంయుక్త గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మహిళలు, విద్యార్థినులపై అఘాయిత్యాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, ఇలాంటి వాటిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలన్నారు. మార్గదర్శకుడిగా ఉండాల్సిన లైబ్రేరియన్ విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం బాధాకరమని, ఇందుకు సహకరించిన ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయురాలిని కఠినంగా శిక్షించాలన్నారు. మహిళలపై వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెబుతూ మహిళా హోంమంత్రి, డిప్యూటీ సీఎం ప్రకటనలకే పరిమితమయ్యారని, ఆచరణలో మాత్రం విఫలమయ్యారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యార్థినులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

కర్నూలు (టౌన్): గత డిసెంబర్ 7 నుంచి 10వ తేదీ వరకు పశ్చిమ గోదావరి జిల్లా మార్టేరు గ్రామంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో సత్తా చాటిన కర్నూలు క్రీడాకారుడు షేక్ ఆఫ్రీద్ బాషాకు ఆంధ్రప్రదేశ్ జట్టులో చోటు లభించింది. అతడు ఈ నెల 5 నుంచి 12వ తేదీ వరకు గుజరాత్ రాష్ట్రంలోని భావ్‌నగర్‌లో నిర్వహించనున్న 74వ సీనియర్ జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొననున్నాడు. కర్నూలు నుంచి సీనియర్ నేషనల్ బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారుడిని అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం, అసోసియేషన్ అధ్యక్షురాలు నీలిమ, భానుప్రసాద్ నాయకులు దా దాబాషా అభినందించారు. ఆఫ్రీద్ బాషా ప్రస్తుతం చిత్తూరు జిల్లాలో రాష్ట్ర జట్టు తరపున శిక్షణ శిబిరంలో ఉన్నట్లు వారు వెల్లడించారు.

విద్యార్థులకు నూతన సంవత్సర కానుక



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి

కల్లూరు: నూతన సంవత్సర కానుకగా పార్టీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు చెబుతూ అందించిన పుస్తకాలు, పెన్నులు, ఇతర విద్యా సామగ్రిని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి గురువారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా తనకు శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చే వారు పూలమాలలు, బొకెలు, శాలువాలకు బదులుగా విద్యార్థులకు ఉపయోగపడేలా నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు వంటివి తీసుకురావాలని కాటసాని రాంభూపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. దీంతో బుధవారం నూతన సంవత్సరం సందర్భంగా పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు చెప్పడంతో పాటు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు తదితర విద్యా సామగ్రిని అందించారు. పెద్ద ఎత్తున పోగైన విద్యా సామగ్రిని గురువారం కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. సిలబస్ ఎంతవరకు పూర్తయ్యిందని అడిగారు. అలాగే పాఠశాలలో కల్పిస్తున్న వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్ నారాయణరెడ్డి, నాయకులు తిరుమలేష్ గౌడ్, తిరుపాల్, ప్రధానోపాధ్యాయులు హుస్సేన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఉమ్మడి కర్నూలు జిల్లా వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో 2025 నూతన సంవత్సర క్యాలెండర్లను ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కాటసాని శివనరసింహారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. పార్టీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు ఆర్.ప్రశాంత్, ఉపాధ్యక్షుడు మణిరెడ్డి, ఆర్‌యూ విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

వలంటీర్లకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

కోడుమూరు రూరల్: ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబునాయుడు వలంటీర్లకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరుతూ గురువారం మండలంలోని ప్యాలకుర్తి గ్రామానికి చెందిన వలంటీర్లు గ్రామ సచివాయలంలో డిజిటల్ అసిస్టెంట్ శరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు కుమార్, అరుణ్‌కుమార్, హమీద్, రాజశేఖర్, మాధవలక్ష్మి, గిరిజ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు రాష్ట్రవ్యాప్తంగా వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని, గౌరవ వేతనంగా రూ.10 వేలు చెల్లిస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయితే అధికారంలోకొచ్చి 7 నెలలు గడుస్తున్నా హామీలను నెరవేర్చలేదని వాపోయారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం స్పందించి ఇచ్చిన హామీ మేరకు క్యాబినేట్ సమావేశంలో వలంటీర్లకు న్యాయం జరిగేలా నిర్ణయం తీసుకోవడంతో పాటు, 7 నెలల గౌరవ వేతన బకాయిలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



కార్మికుల సభ్యత్వ నమోదు చేస్తున్న సీపీఎం నాయకులు

కల్లూరు: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం భవన నిర్మాణ కార్మిక సంఘం న్యూసిటీ కమిటీ ఆధ్వర్యంలో కల్లూరు సర్కిల్ వద్ద సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు నరసింహులు, సుధాకరప్ప మాట్లాడుతూ.. భవన నిర్మాణ రంగంలో పనులు లేకపోవడంతో కార్మికులు, వారి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా బోర్డును ప్రారంభించలేదన్నారు. అనేక దఫాలుగా ధర్నాలు నిరసనలు తెలియజేస్తూ ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు అందించామన్నారు. కార్యక్రమంలో చాంద్‌బీ, రంగన్న, అయ్యమ్మ, మద్దిలేటి, రామాంజనమ్మ, సుబ్బమ్మ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.